సాక్షి చిత్తూరు

ఆదివారం । 19 । మార్చి । 2023



కమనీయం కల్యాణం

రాపూరు : పెంచలకోన క్షేత్రంలో పెనుశిల నృసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవను శాస్త్రోక్తంగా జరిపించారు.



శనేశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలోని శనేశ్వర స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 62,938 మంది స్వామివారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.5 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న మురళీకృష్ణ దంపతులు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం గో సంరక్షణ ట్రస్ట్‌కు బెంగుళూరుకు చెందిన కొట్టు మురళీకృష్ణ, మహేశ్వరి దంపతులు రూ.5లక్షలను విరాళంగా అందజేశారు. శనివారం ఆలయానికి విచ్చేసిన వారు ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డిని కలసి ఈమేరకు విరాళాన్ని అందించారు. వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి వేదపండితులచే ఆశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అధికారులు అందించారు.

మహిళలకు ఉపాధి శిక్షణ

చంద్రగిరి: మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆంధ్రాబ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మార్చి 27 నుంచి 30 రోజుల పాటు ఆర్యవర్క్, ఫ్యాబ్రిక్, బ్యూటీపార్లర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన తెల్లరేషన్ కార్డుగల, 19 నుంచి 45 ఏళ్ల వయస్సు మహిళలు అర్హులని వివరించారు. కనీస విద్యార్హత పదోతరగతి ఉండాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రవాణా చార్జీలు, యూనిఫామ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా సంస్థకు వచ్చి పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకా నగర్, చంద్రగిరి, 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


కంటిని కాపాడుకుందాం



మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ నాయక్

చిత్తూరు రూరల్: ప్రతి ఒక్కరూ కంటి సమస్యలను గుర్తించి ఆలస్యం చేయకుండా కాపాడుకోవాలని డీసీహెచ్ఎస్ బీఎస్‌కే నాయక్ అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ప్రపంచ గ్లకోమా (నీటి కాసులు) వారోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కంటి డ్రైనేజీ నిర్మాణాలు సరిగ్గా పని చేయకపోవడం వల్ల లోపల పీడనం పెరిగి నరానికి హాని కలిగించడమే గ్లకోమా అని తెలిపారు. ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు కనిపించక పోవచ్చని, క్రమంగా చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. డీఎంఅండ్ హెచ్ఓ శ్రీహరి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సుధ మాట్లాడుతూ గ్లకోమా నిర్ధారణకు పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు చేయాలన్నారు. సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణే విజయానికి తొలిమెట్టు



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

శ్రీరంగరాజపురం : ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివితే వారి జీవితం ఓ కొత్త బంగారులోకంలా ఉంటుందని జిల్లా విద్యాశాఖధికారి విజయేంద్రరావు అన్నారు. శనివారం 49 కొత్తపల్లెమిట్టలోని శ్రీవిజయవాణి జెడ్పీ హైస్కూల్‌లో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ వెంకటాద్రినాయుడు యఎంఈఓ అరుణాచలం రెడ్డి, ఎస్ఐ షేక్షా వలి, మాజీ సర్పంచ్ విజయబాబు పాల్గొన్నారు.

అవలీలగా గెలిచే స్థానంలో పీడీఎఫ్‌కు ఓటమి ఎదురైంది.. హోరాహోరీ పోటీ ఇచ్చే స్థానంలో ఘోర పరాభవం ఎదురైంది.. ఏళ్ల తరబడి ఏకపక్షంగా విజయం సాధిస్తున్న స్థానంలో అపజయం ఎదురైంది.. గెలుపోటములను శాసించే స్థాయి ఉన్న స్థానంలో తిరస్కారం ఎదురైంది.. కూర్చున్న కొమ్మనే నరుకున్న చందంగా తయారైంది ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ పరిస్థితి. గట్టి పట్టున్న ప్రాంతాల్లోనూ ఓటర్లు వెక్కిరించే దుస్థితి దాపురించింది. దీనికి ప్రధాన కారణం టీడీపీతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకోవడమే అని పీడీఎఫ్ శ్రేణులు మండిపడుతున్నాయి. బాబుతో చేతులు కలిపి తీరని ద్రోహం చేశారని నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అనైతిక పొత్తు వల్లే అటు ఉపాధ్యాయులు.. ఇటు పట్టభద్రులు మొండిచేయి చూపించారని ఆవేదన చెందుతున్నాయి.



పొత్తు.. చిత్తు

- పీడీఎఫ్‌ను దెబ్బకొట్టిన టీడీపీ
- లోపాయికారీ ఒప్పందంతోనే ఓటమి
- బాబు ట్రాప్‌లో పడి మునిగిపోయామని పీడీఎఫ్ శ్రేణుల ఆవేదన

సాక్షి, తిరుపతి : తూర్పు రాయలసీమలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులు బొక్కబోర్లా పడ్డారు. టీచర్ల స్థానంలో వైఎస్సార్‌సీపీ బలపరచిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గ్రాడ్యుయేట్లకు టీడీపీ తరపున బరిలో దిగిన కంచర్ల శ్రీకాంత్ చౌదరి గెలుపొందారు. దీనిపై పీడీఎఫ్ నేతలు ఆత్మ విమర్శ చేసుకుంటున్నారు. దశాబ్దాలుగా శాసించిన స్థానాల్లో ఘోర పరాభవం మూటగట్టుకోవడంపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఎక్కడ తప్పు జరిగిందో అర్థం చేసుకుని తలలు పట్టుకుంటున్నారు.

ఒప్పందమే ముంచేసింది!

2019 సార్వత్రిక ఎన్నికల నుంచి టీడీపీని వరుస పరాజయాలే వరించాయి. ప్రతి ఎన్నికల్లోనూ ఓడిపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నిస్తేజం అలుముకుంది. ఈక్రమంలో వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికలపైనా వారికి ఏమాత్రం ఆశలు లేవు. అయినప్పటికీ చంద్రబాబు ఆదేశాలతో తూతూమంత్రంగా పోటీ చేసేందుకు ముందుకు వచ్చారు. ఇదే సమయంలో టీడీపీ అధినేత కుతంత్రాలకు పదును పెట్టారు. ముందుగా వామపక్ష నేతలను వలలో వేసుకున్నారు. టీచర్ల ఎమ్మెల్సీ స్థానానికి మద్దతు ఇస్తామని, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి టీడీపీ బలపరచిన అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓటు వేయాలని పీడీఎఫ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు.

కనుచూపు మేరలో కనిపించని బీజేపీ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కనీస పోటీ ఇవ్వలేకపోయారు. ఆ పార్టీ తరపున బరిలో నిలిచిన సన్నారెడ్డి దయాకర్‌రెడ్డికి కేవలం 6,364 ఓట్లు రావడం గమనార్హం

బాబుతో జతకట్టి తప్పు చేశాం!

టీడీపీతో పొత్తు పెట్టుకుని తప్పు చేశామని పీడీఎఫ్ నేతలు వాపోతున్నారు. ఒప్పదం ప్రకారం గ్రాడ్యుయేట్ ఎన్నికల ప్రచారానికి తమను బాగా వాడుకున్నారని, టీచర్ల ఎన్నికకు సంబంధించి టీడీపీపై ఉన్న వ్యతిరేక భావమే నష్టం చేసిందని పీడీఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము మద్దతు ఇచ్చినందునే టీడీపీకి ఓటేశామని పలువురు ఉద్యోగులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారని వివరిస్తున్నారు. అందుకే టీడీపీ బలపరచిన అభ్యర్థి శ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓట్లు 1,15,646 వచ్చాయని స్పష్టం చేస్తున్నారు. అవి గెలిచేందుకు చాలకపోవడంతో పీడీఎఫ్ ఓటర్లు వేసిన రెండో ప్రాధాన్యతా ఓట్లతోనే విజయం సాధించారని తెలియజేస్తున్నారు. చంద్రబాబు మాటలు నమ్మడం వల్ల తమ ఉనికినే కోల్పోయే దుస్థితి దాపురించిందని మథనపడుతున్నారు.

● విజయోత్సాహం



తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఎస్వీయూనివర్సిటీలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. మిఠాయిలు పంచుతూ, బాణసంచా కాల్చుతూ సందడి చేశారు. - తిరుపతి ఎడ్యుకేషన్

కల్యాణం.. కమనీయం

వడమాలపేట : మండలంలోని అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధ శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. 11 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమైంది. శ్రీపద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామివారిని పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో నూతన వధూవరులుగా అలంకరించారు. ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణలు, వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సాయంత్రం ఊంజలసేవ వైభవంగా జరిగింది.

వేడుకగా గ్రామోత్సవం

సాయంత్రం శ్రీపద్మావతి ఆండాల్ సమేతంగా సర్వాలంకారభూషితడైన ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు నడుమ తిరుమాడ వీధులల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ కౌంటింగ్

- 3రోజులు శ్రమించిన అధికారులు, సిబ్బంది
- కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు



చివరి దశలో పట్టభద్రుల ఓట్లను లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది.

చిత్తూరు కలెక్టరేట్ : ఎంతో ఉత్కంఠగా కొనసాగిన తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. మూడు రోజుల పాటు కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎటువంటి చిన్న తప్పిదాలు జరగకుండా కౌంటింగ్‌ను పకడ్బందీగా పూర్తి చేశారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్, జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, పలు జిల్లాల సబ్ కలెక్టర్‌లు, తిరుపతి, అన్నమయ్య, ప్రకాశం, నెల్లూరు, జిల్లాల డీఆర్‌వోలు, పలువురు ఆర్డీవోలు పకడ్బందీగా విధులు నిర్వర్తించారు. కౌంటింగ్ ప్రక్రియ మొదలైన రోజు నుంచి అధికారులు రేయింబవళ్లు శ్రమించారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఏజెంట్లకు, కౌంటింగ్ సిబ్బందికి మంచి ఏర్పాట్లు చేశారు. పకడ్బందీగా, సీసీ కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసినందుకు అధికారులను, సిబ్బందిని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ అభినందించారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌లో 23 కేసుల పరిష్కారం



చిత్తూరులో జరిగిన అదాలత్‌లో పాల్గొన్న జిల్లా జడ్జి భీమారావు తదితరులు

చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో 23 కేసులు పరిష్కారమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ అదాలత్‌లో కుటుంబ తగాదాలు, దంపతుల మధ్య గొడవలు, ఫోరం కేసులను పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పించారు. మొత్తం 23 కేసులను పరిష్కరించి రూ.22 లక్షలు సెటిల్ చేశారు. చిత్తూరులో జరిగిన అదాలత్‌లో జిల్లా జడ్జి భీమారావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్‌తో పాటు వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు అనిత, సభ్యులు కోమల, సలీమ్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాలను రూపొందించాలి



కూటలవంక వద్ద పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

బైరెడ్డిపల్లె : అకాల వర్షాలకు వాటిల్లిన పంటల నష్టాల అంచనాలను రూపొందించాలని అధికారులకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ సూచించారు. బైరెడ్డిపల్లె మండలంలో అకాల వర్షాలకు నష్టపోయిన పంటలను శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల నష్టం వివరాలను అంచనా వేయాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. అనంతరం బైరెడ్డిపల్లెలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల వద్ద ధరల పట్టికను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. దేవదొడ్డి, గంగినాయనపల్లె రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి మునికృష్ణ, వ్యవసాయ సహాయకులు పవన్, ఝాన్సీ పాల్గొన్నారు.

మళ్లీ డబుల్ ఇంజిన్ కదలిక

- పదిరోజుల కిందట వి.కోటలో పూడుపామును ఆటోలో స్మగ్లింగ్ చేస్తున్న స్వామినాథ్ ఆచారి అనే వ్యక్తిని అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. ఆటోను సీజ్ చేశారు.
- ఇటీవల పలమనేరులోని సాయి స్మార్ట్ ప్రాంతంలో పూడు పాముల వ్యాపారం కోసం వచ్చిన ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. రూ.1.60 లక్షల నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు.
- రెండేళ్ల కిందట చిత్తూరు నగరంలోని చెన్నమ గుడిపల్లె సమీపంలో 4.5 కిలోల బరువున్న పూడు పాముతో పాటు తమిళనాడు, ఏపీ, కేరళకు చెందిన 13 మందిని అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు.
- చిత్తూరు నగరంలోని నాయుడు బిల్డింగ్ వద్ద ఉన్న ఓ హోటల్‌లో తమిళనాడుకు చెందిన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి రూ.5 లక్షల నగదు, రెండు పూడు పాములు, నాలుగు కార్లను సీజ్ చేశారు.

- చాపకింద నీరులా పూడు పాముల స్మగ్లింగ్
- శక్తులున్నాయంటూ బోల్తా కొట్టిస్తున్న వైనం
- నాలుగు కిలోల పాము.. రూ.2 కోట్లని ప్రచారం
- అంతరించే జాబితాలోకి పల్లెపాములు..?
- మోసగాళ్ల మాటలు నమ్మి కటకటాల్లోకి



డబుల్ ఇంజిన్, రెడ్‌సాండ్ బో, రెండు తలల పాము, పూడుపాము…! ఇలా పిలవడానికి చాలా పేర్లున్న పూడుపాము ఈ మధ్య మళ్లీ వార్తల్లో ప్రముఖంగా వినిపిస్తోంది. పదేళ్ల కిందట విస్తృతంగా ప్రచారంలోకి వచ్చిన పూడు పాముల స్మగ్లింగ్.. కొద్ది రోజుల తరువాత మరుగున పడిపోయింది. ఇటీవల జిల్లాలో కొందరు పూడపాములను పెట్టుకుని ఊచలు లెక్కిస్తుండడం చర్చనీయాంశంగా మారుతోంది. అసలు ఈ డబుల్ ఇంజిన్ కథేంటి..? వీటిపై వస్తున్న పుకార్లు ఏమిటి..? మూఢ నమ్మకాలు..? చట్టం ఏం చెబుతోంది..? అనే విషయాలు పరిశీలిస్తే..

చిత్తూరు అర్బన్: జిల్లాలో పూడుపాముల స్మగ్లింగ్ మళ్లీ తెరపైకి వచ్చింది. మన దేశంతో పాటు ఇరాన్, పాకిస్తాన్‌లో మాత్రమే కనిపించే ఈ తరహా పాములను రెడ్‌శాండ్ గోవా అంటారు. రెండు తలల పాము. స్మగ్లర్లయితే డబుల్ ఇంజన్ అని కోడ్ భాష పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇవి ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోని ఎర్రమట్టి నేలలు, శేషాచలం కొండలు, పలమనేరులోని కౌండిన్య అడవులు, పాలసముద్రం, కుప్పం, పీలేరు, సత్యవేడు ప్రాంతాల్లో అరుదుగా కనిపిస్తాయి. పాము బరువు ఆధారంగా రెండు కిలోలు ఉంటే రూ.30 లక్షలు పలుకుందని.. దాన్ని అలాగే ఉంచి నాలుగు కిలోల బరువు వచ్చిన తరువాత విక్రయిస్తే రూ.2 కోట్లు పలుకుతుందని కొందరు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుతున్నారు. ఎవరు కొంటారో తెలియదు, ఎంతకు కొంటారో తెలియదు.. కానీ కొనేవాడు ఒకరు వస్తారంటూ పామును తమవద్దే ఉంచుకోవడం, వచ్చిన వాళ్లకు ఎగ్జిబిషన్‌లో చూపించినట్లు పామును చూపించి ఈ విషయం ఆనోట ఈనోట పాకి పోలీసులకు, అటవీశాఖ అధికారులకు చేరి చివరకు కటకటాల పాలవుతున్నారు.


అన్నీ పుకార్లే..

ఎలాంటి విషం లేని సాధారణ మట్టిలో జీవించే పూడుపాములు మనుషులకు ఎలాంటి హాని చేయవు. పూడుపాముకు రెండు తలలు ఉంటాయని.. ఆర్నెళ్లు ఒక తలవైపు.. ఆర్నెళ్ల తరువాత రెండో తల వైపు పాకుతుందనే ప్రచారం ఉంది. ఈ పామును ఇంట్లో ఉంచుకుంటే దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయనే మూఢ నమ్మకం కూడా ఉంది. దీన్ని విదేశీయులు ఆహారంగా తీసుకుంటారని, ఫలితంగా లైంగిక సామర్థ్యం పెరుగుతుందనే తప్పుడు ప్రచారంతో పిచ్చి పీక్‌కు చేరి స్మగ్లర్లు రంగంలోకి దిగుతున్నారు. చైనా, థాయ్‌లాండ్, ఇండోనేషియాల్లో పూడుపామును ఇళ్లలో ఉంచుకుంటే రాత్రికి రాత్రే కోటీశ్వరులైపోతారని నమ్మిస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీన్ని రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారంటూ స్మగ్లర్లు ప్రచారం చేస్తున్నారు. ఫలితంగా జిల్లాలోని పలుప్రాంతాల అమాయక వ్యక్తులు పూడుపాముల ఊబిలో పడి ఊచలు లెక్కించాల్సి వస్తోంది.

వాస్తవాలు ఇలా..

పూడుపాముకు అసలు రెండు తలలు ఉండవు. 60–120 సెం.మీ పెరిగే ఈ పాములు స్మగ్లర్ల కారణంగా అంతరించిపోతున్నాయి. కారణం.. ఎవరో ఒకరు వచ్చి పూడుపామును రూ.కోట్లు పెట్టి కొంటారని కొందరు, మంత్రాలు చదివి పామును బలిస్తే మంచి జరుగుతుందంటూ క్షుద్రపూజలకు బలి ఇవ్వడం, ఇంట్లో పెట్టుకుంటే మంచి జరుగుతుందని తీసుకెళ్లి రకరకాల ఆహారం అందించడంతో అది చచ్చిపోతోంది. పల్లెటూర్లలో, అడవుల్లో ఎక్కువగా కనిపించే ఈ పాము ప్రస్తుతం ఎక్కడా పెద్దగా తారసపడడం లేదు. విదేశాల్లో హాట్ కేకుల్లా దీన్ని కొంటున్నారని చాలా మంది చెబుతున్నా ఏఒక్కరూ రూ.కోట్లు వెచ్చించి వీటిని కొనుగోలు చేసిన దాఖలాలులేవు.

ఏడేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా



రెండు తలలపామును ఇంట్లో పెట్టుకోవడం, నిర్బంధించడం హింస కిందకు వస్తుంది. వన్య ప్రాణి సంరక్షణ చట్టం –1972 ప్రకారం శిక్షలు కూడా ఉన్నాయి. ఈ చట్టం ప్రకారం పూడు పామును ఉంచుకున్న వ్యక్తికి గరిష్టంగా ఏడేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. దీంతోపాటు ఎదుటివాళ్లను మోసం చేయడం చీటింగ్ కిందకు వస్తుంది. దీనికి అదనంగా మరో ఐదేళ్లు జైలు శిక్ష పడుతుంది. ఇది తెలియక చాలా మంది ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ఇలాంటి ప్రయత్నాలు మానుకుంటే మంచిది.

– వై.రిషాంత్‌రెడ్డి, ఎస్పీ చిత్తూరు

క్లుప్తంగా

పోక్సో చట్టంపై అవగాహన పెంచాలి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: బాలికలపై జరిగే లైంగిక దాడుల నివారణ కోసం రూపొందించిన పోక్సో చట్టంపై ప్రజలకు కనీస అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అన్నారు. శనివారం చిత్తూరులోని న్యాయసేవాసదన్ భవన్‌లో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలో తరచూ ఎక్కడెక్కడ ఈ తరహా కేసులు నమోదవుతున్నాయో గుర్తించాలన్నారు. దీనికి కారణాలను అన్వేషించి ఆ ప్రాంత ప్రజలకు పోక్సో చట్టం గురించి తప్పనిసరిగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఇందులో పోలీసుశాఖ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. నేరం జరగక ముందే నివారించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. న్యాయమూర్తులు శ్రీనివాసరావు, శాంతి, వెన్నెల, కీర్తన, శ్రీనివాస్, రవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేంద్రరెడ్డి, కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క కాల్‌తో విద్యుత్ సమస్యల పరిష్కారం

- సిబ్బంది పరిష్కరించకపోతే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫిర్యాదు చేయండి
- ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై



చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారులు ఎటువంటి సమస్యలున్నా ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు ఫోన్ చేయవచ్చని ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ ఇన్‌చార్జి ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను సిబ్బంది పరిష్కారించకపోయినా, సేవలకు డబ్బులు అడిగినా టోల్‌ఫ్రీ నంబరు 1912 నంబరుకు ఫిర్యాదు చేయ వచ్చని సూచించారు. నగరంలోని మిట్టూరు సెక్షన్ పరిధిలో ఉండే ఏఆర్ టాప్‌లైన్, గూల్సింగ్ పేట, కొండమిట్ట, మాదాగుడివీధి, పొనియమ్మన్ వీధి, చర్చివీధి, ప్రాంతాల వారు 9440811825 నంబర్‌కు, గిరింపేట సెక్షన్ పరిధిలోని బాలాజీనగర్, గొడుగుమూరు, ఇరువారం, జానకరాపల్లె, శంకరయ్యగుంట, ప్రశాంత్‌నగర్‌వాసులు 9440811826 నంబర్‌కు, సంతపేట పరిధిలోని డీఐ రోడ్డు, హైరోడ్డు, జెండామాను, మార్కెట్‌వీధి, గంగనపల్లె, చవటపల్లె వినియోగదారులు 9400811830, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, లాయర్స్‌కాలనీ, ఎస్టేట్, బాపూజీనగర్, వెంగళ్రావుకాలనీ, పోలీసుకాలనీ, బీవీరెడ్డికాలనీ, లక్ష్మినగర్‌కాలనీవాసులు 9440811827 నంబర్‌కు సమస్యలపై సంప్రదించవచ్చని తెలిపారు. ఆవులకొండ ఎ.కాలేపల్లె, ఆవులకొండ, కేవీపురం, ముకలటూరు, పాచిగుంట, వేపంజేరి, వింజాం వాసులు 9440811837, జీడీనెల్లూరు పరిధిలో 100 గొల్లపల్లె, ఎ.కొండేపల్లె, దామరాగుంట, ఈ.కలవ, ఎట్టేరి, గారంపల్లె, కలిజివేడు, కోట్రకోన, నల్లెపల్లె, పి.కలవ, వేల్కూరు వాసులు 9440811838 నంబరుకు ఫిర్యాదు చేయ వచ్చని సూచించారు.

పెనుమూరు పరిధిలో..

పెనుమూరు పరిధిలోని బలిజపల్లె, గుంటిపల్లె, జేబీపల్లె, కేసీపల్లె, కలువగుంట, కలికిరి, ఎల్‌కేపీ ఊరు, లంకెపల్లె, మత్తంపల్లె, పులికల్లు, ఎస్‌ఆర్‌పల్లె, తిరుపల్లె వాసుల 9440811839 నంబర్‌కు, పూతలపట్టు పరిధిలో అకానంబట్టు, బైటపల్లె, బండార్లపల్లె, బొసిపల్లె, చామంతిపరం, చిట్టిపిరల, ఈసీపల్లె, గొడుగుచింత, కేజీపల్లె, కేఆర్‌పురం, కాలెపల్లె, కొత్తకోట, ఎల్‌కేపూరు, ఎం బండపల్లె, ముత్తిరేవుల, నారాయణపల్లె, పాలకూరు, పేట్టమిట్ట, పోలవరం, రామాపూరం, తానేపల్లె, వావిల్‌తోట,వేపనపల్లెవాసులకు 9440811840, పాలసముద్రం మండలంలోని ఏ.మంగపురం,ఆముదాల, ఎ.పుత్తూరు, జీఎంపురం, జేఎల్‌పురం, కె. రామాపురం, కొత్తకండ్రిగ, కృష్ణజమ్మాపురం, మామిడిమానుమూల, మఠవలం, మిధినాథ, నరసింహాపురం, ఆర్‌కేపురం, ఎస్‌ఆర్ కండ్రిగ, ఎస్‌ఆర్ పురం, టీవీఎన్ పురం, టీఆర్ పురం, వనదుర్గాపురం, వెంగళరాజుకుప్పం వాసులు 9440811841 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. కొత్తపల్లె పరిధిలోని ఏఎల్‌పురం, బి.సముద్రం, సి.బండపల్లె, చీలాపల్లె, చిత్తపార, గుడిపాల, ఎన్.మంగళం, పా నాటూరు, పేయనపల్లె, రామాపురం, రెట్టగుంట వాసులు 9440811832, రెడ్డిగుంట పరిధిలోని అన్నుపల్లె, జి.బండపల్లె, ఎల్‌బీపురం, మాపాక్షి, నరిగిపల్లె, ఎస్‌ఆర్ కండ్రిగ, పెద్దిశెట్టిపల్లె, తుమ్మింద, వైఎస్సార్ నగర్, ప్రశాంత్‌నగర్, ఎస్‌సీటీ కాలనీవాసులు 9440811828 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

చిత్తూరు రూరల్ పరిధిలో

చిత్తూరు రూరల్ పరిధిలోని 36 గొల్లపల్లె, అనంతాపురం, బీఎస్‌ఆర్ పేట, చింతలగుంట, దిగువమాసపల్లె, దొడ్డిపల్లె, గాండ్లపల్లె, కె.చెర్లోపల్లె, కుర్చివేడు, మురకంబట్టు, ముత్తుకూరు, ఓబనపల్లె, పాచిగుంట, పంత్రాంపల్లె, పూనేపల్లె, సిద్దంపల్లె, టి.వేపనపల్లె, తాళంబేడు ప్రాంతాలవాసులు 9440811829 నంబరుకు సమస్యలపై ఫిర్యాదు చేయ వచ్చని ఈఈ వివరించారు.

ఆస్పత్రిలో చేర్చాడు.. అదృశ్యమయ్యాడు

- చికిత్సకు వచ్చిన రోగి మృతి
- రికార్డుల్లో తప్పుడు వివరాల నమోదు
- ప్రశ్నార్థకంగా మృతదేహం అప్పగింత
- కేసు విచారిస్తున్న పోలీసులు



సురేష్ మృతదేహం



మృతుని చేతిపై తమిళ అక్షరాలు

నగరి : అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని ఆస్పత్రిలో చేర్చి వెంట బెట్టుకుని వచ్చిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. అతనితో వచ్చిన వ్యక్తి లేకపోవడం, ఇచ్చిన ఫోన్‌నంబరు పనిచేయక పోవడంతో మృతదేహాన్ని ఎవరికి అప్పగించాలో ఆస్పత్రి సిబ్బందికి అర్థంకాలేదు. పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వివరాల్లోకి వెళితే శుక్రవారం రాత్రి నగరి ఏరియా ఆస్పత్రికి అనారోగ్యంతో ఉన్న ఒక వ్యక్తిని మరో వ్యక్తి వెంటబెట్టుకుని వచ్చాడు. ఆయాసంతో ఉన్నాడని, చికిత్స అందించాలని చెప్పి ఇన్‌పేషెంట్‌గా చేర్పించాడు. ఆస్పత్రి సిబ్బంది వివరాలు అడిగితే చికిత్సకు వచ్చిన వ్యక్తి పేరు సురేష్(28), తండ్రి పేరు రామ్మూర్తి అని తెలిపాడు. తమిళనాడు రాష్ట్రం షోళింగర్, 9490186238 ఫోన్ నంబర్‌గా వివరాలు నమోదు చేశాడు. వైద్యులు సురేష్‌కు వైద్యం అందిస్తుండగా వెంట వచ్చిన వ్యక్తి పరారయ్యాడు. అప్పటికే పూర్తిస్థాయి అనారోగ్యంతో ఉన్న సురేష్ శనివారం ఉదయం మృతి చెందాడు. అతనితో పాటు వచ్చిన వ్యక్తి లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది పేషంట్ వివరాల్లో ఉన్న ఫోన్ నంబరుకు కాల్ చేశారు. ఆ నంబరుకు సర్వీసులు నిలిపి వేసినట్లు సమాచారం వచ్చింది. దీంతో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ఆస్పత్రికి చేరుకున్న ఎస్‌ఐ శివశంకర్ వివరాలను ఆరాతీశారు. మృతదేహాన్ని పరిశీలించగా, చేతిపై తమిళ అక్షరాలలో పళని అని రాసి ఉంది. దీంతో ఆస్పత్రిలో ఇచ్చిన వివరాలు సరైనవా లేవా అన్న సందేహాన్ని ఆయన వ్యక్తం చేశారు. తమిళనాడు రాష్ట్రం షోళింగర్‌కు వివరాలు పంపి మృతుని తరపువారి కోసం విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

ఒంటరి ఏనుగు బీభత్సం



ఏనుగు తొక్కేసిన వరి పంట

పెద్దపంజాణి: మండలంలోని పలు గ్రామాల పంట పొలాలపై శుక్రవారం రాత్రి ఒంటరి ఏనుగు దాడి చేసి బీభత్సం సృష్టించింది. శనివారం ఉదయం రైతులు పొలాల వద్దకు వెళ్లి ధ్వంసమైన పంటలను చూసి లబోదిబోమన్నారు. పెద్దకాప్పల్లెలో రైతు రమణారెడ్డికి చెందిన మామిడి చెట్ల కొమ్మలను ఏనుగు విరిచేసింది. వరి పంటను తొక్కి నాశనం చేసింది. కొత్తబూరగపల్లెలో మునిరామిరెడ్డి మామిడి తోటకు అమర్చిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసింది. తిప్పిరెడ్డిపల్లెలో నారాయణరెడ్డి, అమరనాథరెడ్డి వరి పంటను తొక్కేసి తీవ్ర నష్టం చేకూర్చింది. బాబు రెడ్డి డ్రిప్ పైపులను తొక్కి విరిచేసింది. ఎస్టీ కాలనీ కృష్ణప్పకు చెందిన వరిపైరు, అరటి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోతున్నారు.

గణనాథుని సేవలో ప్రముఖులు



కర్ణాటక హైకోర్టు జస్టిస్ రాజేష్‌రాయ్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు కాటమనేని భాస్కర్‌రావు, మధ్యాహ్నం తెలంగాణ రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్, సాయంత్రం, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేష్‌రాయ్, నూతనంగా ఎంపికైన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్వామివారి దర్శనార్థం వేర్వేరుగా విచ్చేశారు. వారికి ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆస్పత్రిలో భౌభౌ..!

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోకి వీధి కుక్కలు చొరబడుతున్నాయి. పలు విభాగాల వద్ద ఇవి సంచరిస్తూ రోగులను భయపెడుతున్నాయి. భౌభౌ అంటూ పరుగు పెట్టేలా చేస్తున్నాయి. మరి కొన్ని విభాగాల వద్ద కాపల కాస్తున్నట్లు కనిపిస్తున్నాయి. వీటిని చూసి రోగులు వెనక్కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవల కుక్క కాటు కేసులు జిల్లాలో పెరగుతున్న విషయం తెలిసిందే. ఆస్పత్రి సిబ్బందితో పాటు రోగులు కూడా భౌభౌకు భయపడుతున్నారు.



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ఓ విభాగం వద్ద కుక్క

వివాహిత అనుమానాస్పద మృతి

- కట్నం కోసం భర్తే హత్య చేశాడని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు



మృతి చెందిన చంద్రకళ

పెనుమూరు(కార్వేటినగరం) : పెనుమూరు మండలం సామిరెడ్డిపల్లెలో శనివారం వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. బంధువుల కథనం మేరకు .. గంగాధరనెల్లూరు మండలం అగ్రహారం దళితవాడకు చెందిన చంద్రకళ, సామిరెడ్డిపల్లె దళితవాడకు చెందిన సాయికుమార్ ఆరేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. చంద్రకళను కట్నం తీసుకు రావాలని సాయికుమార్ రోజు వేధించేవాడు. అనుమానంతో తరచూ హింసించేవాడు. ఈ క్రమంలో శనివారం చంద్రకళ ఉరేసుకుని మృతి చెందినట్లు అత్త,మామలకు సాయికుమార్ సమాచారం అందించాడు. తల్లిదండ్రులు, బంధువులు ఆ గ్రామానికి చేరుకున్నారు. చంద్రకళ మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. తమ కుమార్తెను హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించాడని అల్లుడిపై చంద్రకళ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో కూలీ మృతి



విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన సుందర్‌రాజ్

యాదమరి: మండలంలోని వరిగపల్లెలో భవన నిర్మాణ కార్మికుడు పనులు చేస్తుండగా విద్యుత్‌షాక్ తగలడంతో కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ సుమన్ కథనం మేరకు.. చిత్తూరులోని తోటపాళ్యంకు చెందిన కూలీ సుందర్‌రాజ్(34) శనివారం వరిగపల్లె వద్ద నిర్మాణ పనులు ముగించుకుని ట్యాంకర్‌కు మోటార్ వైర్లు తొలగిస్తున్న సమయంలో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

చౌడేపల్లె: చౌడేపల్లె– సోమల మార్గంలోని సింగిరిగుంట వద్ద మహిళ మెడలోని చైన్‌ను మోటార్‌బైక్‌పై వచ్చిన వారు లాక్కొని ఉడాయించారు. మండలంలోని పరికిదొన పంచాయతీ మొరుంకిందపల్లెకు చెందిన నిర్మల కుమారుడితో మోటార్ సైకిల్‌పై సోమల మండలం మేటిమంద గ్రామానికి వెళుతోంది. సింగిరిగుంట సమీపంలో వీరి వెనుకనే మోటార్ బైక్‌లో ఇద్దరు వచ్చారు. వీరి వాహనాన్ని ఆపారు. నిర్మల మెడలో ఉన్న గొలుసు, తాళి బొట్టును లాక్కొన్నారు. బాధితురాలు కేకలు వేయడంతో బైక్‌పై వారు ఉడాయించారు. సమాచారం అందుకొన్న ఎస్‌ఐ రవికుమార్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలపై ఆరా తీశారు. చైన్ రోల్డ్ గోల్డ్ కాగా, తాళిబొట్టు బంగారని బాధితురాలు తెలిపింది. బాధితురాలు ఫిర్యాదు చేయలేదని, ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన : టీడీపీ నాయకులపై కేసు

కుప్పం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు 29 మంది టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి శ్రీకాంత్ చౌదరి గెలుపొందారని టీడీపీ వర్గాలు సంబరాలు నిర్వహించారు. బస్టాండు ప్రాగణంలో బాణా సంచా కాల్చి, రంగులు చల్లుకుంటూ ర్యాలీ నిర్వహించారు. పోలీసులు హెచ్చరించినా లెక్క చేయకుండా టీడీపీ నేతలు బస్టాండులో సంబరాలు నిర్వహించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. దీనిపై 29 మంది టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిందని శుక్రవారం నిబంధనలను ఉల్లంఘించి మండల కేంద్రంలోని బస్టాండ్‌లో టీడీపీ నేతలు సంబరాలు జరిపారని పేర్కొన్నారు. దీనిపై నాయకులు రమేష్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, శివప్ప నాయుడు , పవన్‌కుమార్, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎస్‌ఈబీ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. అనుమానిత ప్రాంతాల్లో సారా విక్రయాలతో పాటు అక్రమ మద్యం అమ్మకాలపై తనిఖీలు చేపట్టారు. నలగాంపల్లి క్రాస్ వద్ద శ్రీ కాంత్(30) అనే వ్యక్తి వద్ద 20 ప్యా కెట్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తర లించారు. సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.